క్లుప్తంగా

మాదేపల్లి విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు


లీలాసాయి


నేహ

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారని హెచ్ఎం సుంకర వెంకటలక్ష్మి తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో గడ్డం లీలాసాయి (573), యర్రబోలు నేహ (570) అత్యధిక మార్కులు సాధించారని వివరించారు. వీరిద్దరూ ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించి తోటి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారని పేర్కొన్నారు. వీరిని ఉపాధ్యాయులు పువ్వుల ఆంజనేయులు, మేరీ ఎలిజిబత్, శివశంకర్, దుర్గ, వెంకటేశ్వరమ్మ, ఉషశ్రీ, అపర్ణ, యాస్మిన్, మణి అభినందించారు.

ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఏలూరు విద్యార్థి


అట్టా పవన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని బాల గంగాధర్ తిలక్ నగర పాలక ఉన్నత పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన అట్టా పవన్ అనే విద్యార్థి ఒంగోలులోని ట్రిపుల్ ఐటీ క్యాపస్‌కు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయుడు కేవీ షర్రక్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాల నుంచి 91 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాయగా వారిలో 75 మంది ఉత్తీర్ణులయ్యారని, వారిలో పవన్ 572 మార్కులు సాధించి ఈ ఘనత పొందాడని పేర్కొన్నారు. రోజువారీ కూలి పనులు చేసుకునే అట్టా ప్రసాద్, భూలక్ష్మి దంపతుల కుమారుడైన పవన్ వెనుకబడిన ప్రాంతమైన నల్లదిబ్బ ప్రాంతంలో నివసిస్తున్నా అకుంఠిత దీక్షతో చదివి తమ పాఠశాలకు, తల్లిదండ్రులకు ఘన కీర్తి తీసుకువచ్చాడని వివరించారు.

కలెక్టర్‌ను కలిసిన ఏలూరు ఎంపీ


కలెక్టర్ వెట్రిసెల్వికి మొక్కను అందిస్తున్న ఏలూరు ఎంపీ

ఏలూరు(మెట్రో): కలెక్టర్ వెట్రిసెల్విని గురువారం ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక కలక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఎంపీ మహేష్ యాదవ్ కలెక్టర్‌ను కలిసి మొక్కను అందజేశారు.

24 గంటల్లోనే సమస్యల పరిష్కారానికి చర్యలు

నగర కమిషనర్ వెంకటకృష్ణ


రాజరాజేశ్వరి నగర్‌లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ

ఏలూరు టౌన్: నగరపాలక సంస్థ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశామని, ఫిర్యాదులను 24 గంటల్లోనే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని ఏలూరు కమిషనర్ వెంకటకృష్ణ తెలిపారు. కమాండ్ కంట్రోల్ ఫోన్ నెంబర్ 89789 99955, టోల్‌ఫ్రీ నెంబర్ 1800 425 4287, ల్యాండ్ లైన్ నెంబర్ 08812 232101కు సమస్యలపై ఫిర్యాదు చేయాలని కోరారు. ఆయన గురువారం తెల్లవారుజాము నుంచీ ఉదయం 8 గంటల వరకు నగరంలో విస్తృతంగా పర్యటించారు. నవయుగ హోటల్, సాయినగర్ సచివాలయంలోనూ పారిశుధ్య కార్మికుల హాజరును పరిశీలించారు. కార్మికులు సక్రమంగా విధులకు హాజరు కావాలని ఆదేశించారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోణంగిలోని చెత్త, వ్యర్థాల డంపింగ్ యార్డ్‌ను, వర్మీకంపోస్ట్ యూనిట్‌ను కమిషనర్ పరిశీలించారు. రాజరాజేశ్వరి నగర్‌లో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పత్తేబాద రైతుబజార్, వన్‌టౌన్‌లోని రైతుబజార్‌లను సందర్శించారు. అక్కడి పరిస్థితులను ఎస్టేట్ ఆఫీసర్‌లతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకట కృష్ణ మాట్లాడుతూ ఏలూరు నగరంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టామని తెలిపారు.

మేకల కబేళా అభివృద్ధికి చర్యలు

జంతువధశాల (మేకల కబేళా) అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణతో కలిసి ఆయన ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని మేకల కబేళాను గురువారం సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈ కొండలరావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి, డీఈ తాతబ్బాయి, ఏఈలు సాయి, రాఘవేణి, కబేళా సభ్యులు ఉన్నారు.

కళాశాలల్లో ప్రవేశాల గడువు పొడిగింపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్టు ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల, కోర్స్ ఎంపికను ఈ నెల 23వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఏలూరులోని కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత సహాయ కేంద్రంలో సంప్రదించవచ్చని తెలిపారు. బీఏ హిస్టరీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం



మహిళా చట్టాలపై మాట్లాడుతున్న జడ్జి రాజరాజేశ్వరి తేజస్విని


సదస్సుకు హాజరైన మహిళలు, పోలీసు సిబ్బంది

ఏలూరు (టూటౌన్): చట్టాలు, చదువుతో పాటు, సమాజంలో ప్రతి విషయంపైనా అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి ఎం రాజరాజేశ్వరి తేజస్విని మహిళలకు సూచించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో మహిళా చట్టాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ, స్వాతి మహిళా అభ్యుదయ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో ట్రైనీ జడ్జిలు రాజరాజేశ్వరి తేజస్విని, పీవీఎస్ఎన్ లక్ష్మి లావణ్య, పీవీ నాగ రంజిత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి రాజరాజేశ్వరి తేజస్విని మాట్లాడుతూ మహిళలు సమాజంలో జరిగే ప్రతి విషయంపైనా పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పుడే సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రతి అంశంలో పురుషులతో సమానంగా పోటీపడుతున్నప్పటికీ ఎక్కడో ఒక చోట సమస్యలు ఎదుర్కొనాల్సి వస్తుందని చెప్పారు. సమస్యలపై పోరాడాలని సూచించారు. నేడు మానవ అక్రమరవాణా విరివిగా జరుగుతోందని, ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని మహిళలకు సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చట్టం కఠినమైన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ మంగా కుమారి, ప్యానల్ అడ్వకేట్ కూనా కృష్ణారావు, పి.రత్నరాజు, టి.సుబ్బారావు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో స్థానికులనే నియమించాలి


మాట్లాడుతున్న రవి

ఏలూరు (టూటౌన్): ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో స్థానికులనే నియమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. గురువారం పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలూరు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న బుట్టాయగూడెం, విప్పలపాడులలో ఉన్న ఏకైక ఏకలవ్య గిరిజన గురుకుల పాఠశాలలో పర్మినెంట్ ఉద్యోగులుగా ఉత్తరాదికి చెందిన 18 మందిని నియమించడం దురదృష్టకరమన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు దక్షిణాదిలో హిందీని బలవంతంగా రుద్దాలనే అజెండాలో భాగంగానే ఈ విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. హిందీ మాత్రమే వచ్చిన వారు ఇక్కడ ఏ భాషలో విద్యాబోధన చేయగలుగుతారని ప్రశ్నించారు. నెల్లూరు జిల్లాకు చెందిన చంద్రశేఖరపురంలో ఉన్న ఏకలవ్యవ గిరిజన గురుకుల పాఠశాలకు వెళ్లిన విద్యార్థులను హిందీలో మాత్రమే సమస్యలు తెలిపాలంటూ, హిందీ రాకపోతే అసలు రావద్దంటూ ప్రిన్సిపాల్ చెప్పారనే వార్తలు రావడం విచారకరమని తెలిపారు. అక్కడ ఇంగ్లీషు పాఠాలు కూడా హిందీలోనే చెబుతున్నట్టు తెలిసిందన్నారు. ఈ రకంగా వ్యవహరిస్తే విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పద్ధతి గిరిజనులను ఉన్నత విద్యల నుంచి దూరం చేసే కుట్రలో భాగంగానే పరిగణించాల్సి వస్తుందని చెప్పారు. రాష్ట్రంలో కూటమి కొత్త ప్రభుత్వం ఈ విషయంలో తెలుగు రాష్ట్రంలో ఈ ప్రాంతాలకు చెందిన వారిని మాత్రమే నియమించాలని రవి కోరారు. స్థానిక భాషలో విద్యా బోధన చేసే విధంగా స్థానికులను మాత్రమే ఏకలవ్య గిరిజన గురుకుల పాఠశాలల్లో నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.

జాతీయ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడి మృతి

ఏలూరు రూరల్ : జాతీయ బాస్కెట్‌బాల్ సీనియర్ క్రీడాకారుడు ఓలేటి రామ్మోహనరావు (77)వయస్సు రీత్య కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం ఏలూరులోని తన స్వగృహంలో మృతి చెందారు. ఆయన బీఎస్ఎన్ఎల్‌లో సీనియర్ అధికారిగా పదవీ విరమణ చేశారు. సుమారు 30 ఏళ్ల బీఎస్ఎన్ఎల్ బాస్కెట్‌బాల్ జట్టు క్రీడాకారుడుగా సేవలు అందించారు. కళాశాలలో చదువుకుంటున్న సమయంలో జూనియర్ నేషనల్ పోటీల్లో పాల్గొన్నారు. పలుమార్లు ఆంధ్ర యూనివర్శిటీ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. అయన కుటుంబ సభ్యులకు రిటైర్డ్ డీఎస్‌డీఓ కేటీఎస్ఆర్ ఆంజనేయులు, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అధిక జనాభాతో అన్నీ సమస్యలే


ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ వెంకటకృష్ణ, వైద్యారోగ్య సిబ్బంది

ఏలూరు టౌన్ : సామాజిక పరిస్థితులకు అనుగుణంగా భార్య, భర్త అవగాహనతో పిల్లలను కనాలని ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ సూచించారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని పవరుపేట యూపీహెచ్‌సీలో అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువతికి 21 సంవత్సరాలు, యువకునికి 25 సంవత్సరాలు నిండిన అనంతరం వివాహం చేస్తే మంచిదన్నారు. బిడ్డకు, బిడ్డకు మధ్య ఎడమ పాటించాలని సూచించారు. కుటుంబ సంక్షేమమే దేశ సౌభాగ్యమని అధిక జనాభాతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని వివరించారు. పుట్టిన ప్రతి బిడ్డను రిజిస్ట్రేషన్ చేయించాలని, అప్పుడే దేశ ప్రణాళికలు అమలుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. జనాభాకు అనుగుణంగా సంక్షేమ పథకాలు, ప్రణాళికలు అమలు చేయడం సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి, యూపీహెచ్‌సీ వైద్యాధికారి గౌతమ్, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, హెల్త్ సూపర్‌వైజర్ ఝాన్సీ, హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

సెట్‌వెల్ ఆధ్వర్యంలో జనాభా దినోత్సవం


బహుమతులు అందుకున్న విద్యార్థులతో అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించినట్టు సెట్‌వెల్ ముఖ్యకార్యనిర్వహణాధికారి సి.మధు భూషణరావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వంగా వెంకటేశ్వరరావు, డీఎస్‌డీఓ. జి.సుధాకర్, నేషనల్ కెరీర్ సర్వీసు జిల్లా కోఆర్డినేటర్ జి.ప్రవీణ్ కృష్ణ, ఈఓ ఒకేషనల్ గైడెన్స్ కోర్స్ వి.వరలక్ష్మి, సెట్ వెల్ మేనేజర్ పీవీఎస్ సత్యనారాయణ మాట్లాడారు. విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సెట్ వెల్ పర్యవేక్షకులు కేజే కెన్నెడీ, పసుపులేటి ప్రసాద్, ఆదిత్య కళాశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక శాంతినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 11 కేవీ కట్టా సుబ్బారావు తోట ఫీడర్‌కు చెట్ల కొమ్మల తొలగింపు, లైన్లకు వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్జేవియర్ నగర్, కట్టా సుబ్బారావు తోట, విద్యానగర్ సాయిబాబా టెంపుల్, శాతవాహన నగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలోని వైభవ్ పోర్ట్ ఏరియా, కాంగ్రెస్ ఆఫీస్ వీధి, వెన్నవల్లివారి పేట, నవాబ్ పేట, సత్యనారాయణ పేట, లంబాడీ పేట, బావిశెట్టివారి పేట, నల్లదిబ్బ, కెనాల్ రోడ్ పరిసర ప్రాంతాలలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

సంతోష్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో ఆర్ఎంఎస్ కాలనీ, డీ మార్ట్ ప్రాంతం, మంచినీళ్లతోట, చాణక్యపురి కాలనీ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఏలూరు మండలం కోటేశ్వర దుర్గాపురం, తిమ్మారావు గూడెం, మాధవపురం, మొండికోడు, కొమడవోలు, హమాలీ నగర్, దుర్గ గ్రాండ్ సిటీ, ఆండాళ్లమ్మతోట, రామ నగర్, మారుతీ నగర్, మస్తాన్ మన్యం కాలనీ, నాగేంద్ర కాలనీ, శ్రీరామ్ నగర్‌కాలనీ, శాస్త్రి కాలనీ, చెంచుల కాలనీ, ఆటోనగర్, కొమడవోలు, తూర్పులాకులు, సాయి నగర్ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

లక్ష్యాలను సాధించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రణవి

ఏలూరు రూరల్ లక్ష్యాలను నిర్దేశించుకుని ఇష్టపడి చదవి సాధించుకోవాలని ఎంపీడీఓ బి.ప్రణవి విద్యార్థులకు సూచించారు. గురువారం ఆమె ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలలను సందర్శించారు. తరగతి గదుల్లో మౌలిక వసతులు, తాగునీరు, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రత పరిశీలించారు. బాలబాలికలకు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని హెచ్ఎంలకు సూచించారు. మాదేపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులకు పలు ప్రశ్నలు సంధించారు. బోర్డుపై భారతదేశ మ్యాప్ గీయించి, వివిధ రాష్ట్రాలు, ప్రాంతాలను గుర్తించమన్నారు. 10వ తరగతి సిలబస్ మారినందున మరింత శ్రద్ధతో చదువుతూ రివిజన్ చేయాలన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	31
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	18
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	28

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	24
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	29
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	20
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు - తిరుపతి	16.00	4830	25

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	50	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	84
వంకాయలు (కాంతులు)	32	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	10, 12
బెండకాయలు	38	కంద	60
పచ్చిమిర్చి	44	బీట్‌రూట్	36
కాకర కాయలు	52	కీరా దోస	48
బీరకాయలు	28	ఫ్రెంచ్‌బీన్స్	100
బీరకాయలు (పందిరి)	32	అల్లం	180
క్యాబేజీ	44	కొత్తిమీర (కట్ట)	18
క్యారెట్	34-50	పాలకూర	12
దొండకాయలు	34	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	40	గోంగూర	07
గోరుచిక్కుడు	60	పుదీనా	05
దోసకాయలు	26	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	94
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	44

కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభం

పెదపాడు : విద్యార్థులు ప్రభుత్వంతో పాటు దాతలు అందించిన మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. పెదపాడు మండలం వట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఎన్నారైలు ఉత్తర అమెరికా తెలుగు సంఘం చైర్మన్ ప్రశాంత్ పిన్నమనేని అధ్యక్ష, ఉపాధ్యక్షులు మదన్ పాములపాటి, దూళిపాళ భాను ప్రకాష్ సాయం రూ.3 లక్షల వ్యయంతో 10 కంప్యూటర్లు ఏర్పాటు చేయడంతో పాటు కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ అందించడం మంచి పరిణామమని ఎమ్మెల్యే అన్నారు. కంప్యూటర్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. పాఠశాలలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను, మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఓ ఎస్ అబ్రహం, ఎంపీడీఓ జె.తేజరతన్, ఎంఈఓలు సబ్బితి నర్సింహమూర్తి, డీవీరమణ, టీడీపీ నాయకులు ఉప్పలపాటి రాం ప్రసాద్, గుత్తా అనీల్, అక్కినేని వంశీ కొమ్మన లక్ష్మణ మోహన్, నూతలపాటి నవీన్, ముళ్లపూడి సాంబశివరావు, వేగుంట సురేష్, సాగర్, నాని తదితులు పాల్గొన్నారు.

వాకపల్లి గ్రామానికి అవార్డు



కలెక్టర్ నాగరాణి నుంచి అవార్డు అందుకుంటున్న వాకపల్లి సర్పంచ్ శ్రీనివాస్

గణపవరం: గణపవరం మండలం వాకపల్లి గ్రామం టీబీ విముక్త పంచాయతీగా అవార్డు పొందింది. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా భీమవరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టరు చేతుల మీదుగా వాకపల్లి సర్పంచ్ ఆదిమూలం శ్రీనివాస్ అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు. గణపవరం పీహెచ్‌సీ పరిధిలోని ఎ.గోపవరం, వెలగపల్లి గ్రామాలుకూడా టీబీ విముక్త గ్రామాలుగా ఎంపికయ్యాయి. ఇందుకుగాను పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్, సీహెచ్ఓ జాలాది విల్సన్‌లు జిల్లా కలెక్టరు, జిల్వావైద్య ఆరోగ్యశాఖ అధికారి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ప్రతి వెయ్యి మంది జనాభాకు 30 మందికి టీబీ టెస్టులు చేసినందుకు ఆ గ్రామ సర్పంచ్‌లు కూడా అవార్డులు అందుకున్నారు.

మరిన్ని క్లబ్‌ల ఏర్పాటుకు కృషి

దెందులూరు: ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ, అభివృద్ధికి గ్రామ శివారు ప్రాంతాల్లో వాకర్స్ క్లబ్‌ల ఏర్పాటుకు కృషి చేస్తామని వాకర్స్ క్లబ్ దెందులూరు అధ్యక్షుడు, స్వచ్ఛంద సేవా సంస్థ మానవత మండల నాయకులు సుగ్గిశెట్టి సూకరాజు అన్నారు. గురువారం ఉదయం దెందులూరు జాతీయ రహదారిపై వాకర్స్ క్లబ్ సభ్యులు మార్నింగ్ వాక్ అనంతరం సమావేశం నిర్వహించారు. 17 పంచాయతీ శివారు గ్రామాల్లో ప్రాథమికంగా ఆరు క్లబ్‌ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. మారుతోన్న ఆరోగ్య, ఆహార పరిస్థితులు, చిన్నవయస్సులోనే 60 శాతం మంది వివిధ వ్యాధుల బారిన పడటం వంటి ప్రమాదకర పరిస్థితుల దృష్ట్యా నడక వల్ల ఉపయోగాలు చెప్పాలన్నదే తమ క్లబ్ లక్ష్యమని వివరించారు. ఇప్పటికే దెందులూరులో ఉచితంగా యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు.

చాంపియన్‌షిప్‌లో సుభాష్‌కు తృతీయ స్థానం


అవార్డును అందుకుంటున్న చిన్నారి ప్రతిభ సరోజారెడ్డి

జంగారెడ్డిగూడెం: కర్ణాటక స్టేట్ మెమోరీ చాంపియన్‌షిప్ పోటీల్లో జంగారెడ్డిగూడెం ప్రతిభ స్కూలు అకడమిక్ డైరెక్టర్ కాసర సుభాష్‌రెడ్డికి తృతీయ స్థానం లభించింది. ఈ సందర్భంగా ప్రతిభ స్కూల్ ప్రిన్సిపాల్ కాసర సరోజారెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ పోటీల్లో సుభాష్ తృతీయ స్థానంలో నిలిచి సెకండ్ రన్నరప్ ట్రోఫీ, కాంస్య పతకం తోపాటు వివిధ ఈవెంట్స్‌లో ఐదు మెడల్స్ సాధించారు. రాండం వర్డ్స్ ఈవెంట్‌లో ఐదు నిమిషాల్లో 80 పదాలు గుర్తుపెట్టుకుని రాయడంతో వెండి పతకం సాధించినట్లు చెప్పారు. అలాగే 7వ తరగతి చదువుతున్న ప్రతిభ సరోజారెడ్డి కిడ్స్ విభాగంలో రెండు పతకాలు సాధించినట్లు చెప్పారు. ర్యాండం వర్డ్స్ ఈవెంట్ లో 4వ స్థానం, బైనరీ నెంబర్స్ ఈవెంట్ లో 7వ స్థానంతో రెండు పతకాలు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ప్రతిభ స్కూల్లో నిర్వహించిన అభినందన సభలో సుభాష్, ప్రతిభకు డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీ సరోజా రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సింధుషారెడ్డి, విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.